క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలో నియామకాలు

కర్నూలు టౌన్: వైఎస్‌ఆర్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శులుగా మహబుబ్‌బాషా, నాసిర్ బాషాలు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. అలాగే వైఎస్‌ఆర్‌ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా రామకృష్ణ, కిషన్‌లు నియమితులయ్యారు.

హాస్టల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

కర్నూలు(అర్బన్): నగరంలోని ఇందిరాగాంధీ నగర్ ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహంలో శనివారం విద్యార్థులకు వండిన పదార్థాలను, సరుకులను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఫుడ్ సెక్రెటరీ రాజగోపాల్ పాల్గొని స్టోర్ రూమ్‌లోని సరుకులను, వండిన ఆహార పదార్థాలను శాంపిల్స్ తీసకున్నారు. వీటిని నాణ్యత ప్రమాణాల సేకరణ కోసం గుంటూరు రీజినల్ ల్యాబ్‌కు పంపుతామన్నారు. నవ్యాంధ్ర జేఏసీ, మా ల విద్యార్థి సంఘం ఫిర్యాదు మేరకు తనిఖీలు నిర్వహించారు. జేఏసీ అధ్యక్షుడు అయ్యస్వామి, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె. వెంకటేష్, డీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు శరత్‌కుమా ర్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ప్రభుదాస్ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం


అప్పన్న

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన బి.అప్పన్నకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బి.రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీ భూగోళ శాస్త్ర విభాగంలో 'కర్నూలు జిల్లా తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతంలో భూమి, నీటి వనరుల అభివృద్ధికి రిమోట్ సెన్సింగ్ జీఐఎస్ సాంకేతికతల ఉపయోగంతో సమగ్ర ప్రణాళిక రూపొందింపు 'అనే అంశంపై డాక్టర్ వై.సుజాత పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఈ అవార్డు ప్రదానం చేసినట్లు తెలిపారు.

ఆ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

కర్నూలు సిటీ: ప్రభుత్వ స్కూళ్లలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే మెగా పేరెంట్స్‌మీట్‌కు విట్నెస్‌గా మరో శాఖకు చెందిన అధికారిని ఏర్పాటు చేసుకోవాలని జారీ చేసిన ఉత్తర్వులను విద్యాశాఖ వెంటనే వెనక్కి తీసుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డా.వి. కరుణానిధిమూర్తి, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజులు శనివారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం మొదలైనప్పటి నుంచి అధికారులు ప్రతి రోజు ఏదో ఒక కార్యక్రమం ప్రవేశపెడుతూ బోధనకు ఆటంకం కలిగిస్తున్నారన్నారు.

అంతర్జాతీయ సహకార వారోత్సవాలు ప్రారంభం

కర్నూలు (అగ్రికల్చర్): అంతర్జాతీయ సహకార వారోత్సవాలు మొదలయ్యాయి. ఈ సందర్భంగా శనివారం డీసీసీబీలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సహకార పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రైతులకు, అన్ని వర్గాల ప్రజలకు రుణ సదుపాయం కల్పించి ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీజీఎంలు సునీల్ కుమార్, నాగిరెడ్డి, ఏజీఎం త్రినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంటమాలజిస్టుగా చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): జిల్లా మలేరియా విభాగంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ సీనియర్ ఎంటమాలజిస్టుగా పదోన్నతి పొందారు. శుక్రవారం నిర్వహించిన పదోన్నతుల కౌన్సెలింగ్‌లో ఆయనకు పదోన్నతి లభించింది. ఈ నేపథ్యంలో శనివారం ఆయనను కర్నూలు జిల్లా ఆల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీరాములు, సెక్రటరీ వెంకటస్వామి పూలబొకేలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షు లు వెంకటన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ జీసీ రాముడు, నాయకులు సుధాకర్, సుభాషిణి పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్

కర్నూలు (టౌన్): ఆర్టీసీ బస్టాండ్‌లో అపరిశుభ్రత పెరిగిపోయిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లా రెడ్డి, కర్నూలు ఫుడ్ బ్యాంకు చైర్మన్ ఆర్. చంద్రశేఖర్‌లు పేర్కొన్నారు. శనివారం వారు కొత్త బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. టాయిలెట్లు, మరుగుదొడ్ల నిర్వహణ అధ్వానంగా ఉందని, పరిసరాల్లో మురుగు పేరుకుపోయి దుర్వాసన వస్తుందని చెప్పారు. అధికారులు బస్టాండ్ శుభ్రతపై దృష్టి సారించాలని కోరారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: తమ్ముడు, జురాసిక్ వరల్డ్ రీబర్త్, కన్నప్ప, కుబేరా, మార్గన్, ఎఫ్1 ది మూవీ, 3బీహెచ్‌కే
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కన్నప్ప, తమ్ముడు, 3బీహెచ్‌కే, జురాసిక్ వరల్డ్ రీబర్త్, కుబేరా, హుషారు (2018), సోలో బాయ్, షో టైమ్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : కుబేరా, తమ్ముడు
శ్రీరామ : మార్గన్
రాజ్ : జురాసిక్ వరల్డ్ రీబర్త్
భరత్ కాంప్లెక్స్ : వెంకి (2004)
విజయ : కుబేరా
విక్టరీ : 8 వసంతాలు

దేవీ దీవించు


ప్రత్యేక అలంకరణలో లలితా త్రిపుర సుందరి


సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠం, నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఆయా ఆలయాల్లో తొమ్మిది రోజుల పాటు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు శనివారం వారాహి అమ్మవారి హోమం, సువాసిని పూజ, కన్యకా పూజ, సామూహిక కుంకుమార్చన చేపట్టారు. అమ్మవారిని ఒత్తి పత్తితో ప్రత్యేకంగా అలంకరించారు. తమను చల్లగా చూడంటూ భక్తులు అమ్మవారిని మొక్కుకున్నారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి భక్తులకు సందేశమిచ్చారు.


ఒత్తిపత్తి అలంకారంతో వారాహి అమ్మవారు


హోమం చేస్తున్న భక్తులు

ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్‌కు సన్మానం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజి పూర్వ విద్యార్థి అయిన ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ శ్రీహరిరావును శనివారం కర్నూలు మెడికల్ కాలేజిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ డాక్టర్ శ్రీహరిరావు డాక్టర్ల మెడికల్ రిజిస్ట్రేషన్ల విషయంలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. వైద్యుల వద్దకే రిజిస్ట్రేషన్ ప్రక్రియ తీసుకురావడం వల్ల సీనియర్ వైద్యులకు ఎన్నో ఇబ్బందులు తప్పుతాయన్నారు. వైద్యుల అన్ని సాంకేతిక వివరాలు తీసుకోవడం ద్వారా భవిష్యత్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత సులువుగా జరిగేందుకు దోహదపడుతుందన్నారు. డాక్టర్ శ్రీహరిరావు మాట్లాడుతూ తాను ఈ కళాశాల విద్యార్థిగా ఇక్కడే చదివి ప్రిన్సిపాల్, సీనియర్ వైద్యుల చేత సన్మానం చేయించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌లు డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ సింధియా శుభప్రద, హాస్పిటల్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, వైద్యులు పాల్గొన్నారు.


డాక్టర్ శ్రీహరిరావును సన్మానిస్తున్న అధికారులు, వైద్యులు

పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ఆర్‌యూ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కర్నూలు కల్చరల్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్ బాషా, సహాయ కార్యదర్శి శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీ ముఖ ద్వారం వద్ద ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేల కోట్ల రూపా యల ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లించాలన్నారు. ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బకాయిలను చెల్లిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక విద్యాశాఖ మంత్రి వాటి ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. జీవో నెం. 77 రద్దు గురించి కూడా మాట్లాడటం లేదని ఆరోపించారు. వీటిపై సర్కారు స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నాయకులు అలీ, ప్రశాంత్, జగన్, కల్యాణ్, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై విద్యుత్ పోరాటం

కర్నూలు(సెంట్రల్): పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించకపోతే మరో విద్యుత్ పోరాటానికి సిద్ధమవుతామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.శనివారం కర్నూలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యుత్‌చార్జీలను తగ్గించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..2024 ఎన్నికల ముందు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ చార్జీలను పెంచాలని ఆరోపించిన చంద్రబాబునాయుడు...ఇప్పుడు అధికారంలోకి రాగానే విద్యుత్ చార్జీలను పెంచడం అన్యాయమన్నారు. స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండన్న లోకేష్...నేడు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే వ రూ 20 వేల కోట్ల మేర విద్యుత్ భారాన్ని ప్రజలపై వేశారని ఆరోపించారు. కేవలం బడా పారిశ్రామిక వేత్త అదానీ కోసమే విద్యుత్‌స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బీసన్న చంటి, రవి, అఖిల్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దాం

కర్నూలు (రూరల్) : వైఎస్సార్‌సీపీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనర్ పేరపోగు మోహన్ బాబు, కర్నూలు మండల వైస్ ఎంపీపీ నెహెమ్యా పిలుపునిచ్చారు. మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో శనివారం 'కలిసొద్దాం కార్యకర్తను' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు బోయ రామరాజు పాల్గొన్నారు.

పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్తలు తప్పనిసరి

కర్నూలు(హాస్పిటల్): పెంపుడు జంతువుల పట్ల ప్రేమ ఉండటం మంచిదే గానీ జాగ్రత్తలు కూడా తీసుకోవాలని కర్నూలు మెడికల్ కాలేజి కమ్యూనిటీ మెడిసిన్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్నరాణి, డాక్టర్ నాగరాజు అన్నారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా నగరంలోని కేవీఆర్ జూనియర్ కళాశాలలో మెడికల్ కాలేజి ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో జంతువుల నుంచి మనుషులకు వచ్చే రేబిస్, బ్రూసెల్లోసిస్, జైకా, లెప్టోస్పైరోసిస్, నిఫా వైరస్, ఎల్లో ఫీవర్ తదితర వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. చివరగా విద్యార్థులకు జూనోసిస్ వ్యాధులపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ లాలప్ప, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ షేక్ రేష్మ, ఎస్ ఆర్‌లు, పీజీలు, లెక్చరర్లు పాల్గొన్నారు.


డ్రాయింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులతో వైద్యుల బృందం

కర్నూలు (టౌన్) : జంతువుల నుంచి వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని నగర పాలక సంస్థ పశు వైద్యాధికారి డాక్టర్ మల్లన్న సూచించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. నేడు ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

కర్నూలు (టౌన్): పేదరికం లేని సమాజం నిర్మాణమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గానికి సంబంధించిన స్వర్ణాంధ్ర-పీ 4 ప్రథమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. పీ-4 ద్వారా సంక్షేమం పథకాల కోత ఉండదన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, తహసీల్దారు రవికుమార్, మేనేజర్ చిన్న రాముడు, ప్రజారోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

కొట్టాల వాసులకు పట్టాలు ఇస్తాం

నగరంలోని అశోక్ నగర్ పంప్ హౌస్ ఎదురుగా ఉన్న గూడెం కొట్టాలకు పట్టాలు ఇస్తామని మంత్రి టీజీ భరత్ స్పష్టం చేశారు. శనివారం స్థానిక గూడెం కొట్టాలను జాయింట్ కలెక్టర్ బి. నవ్యతో కలిసి మంత్రి పరిశీలించి నివాసితులతో మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కొట్టాల ప్రజలు కలిసి పట్టాలు ఇవ్వాలని అడగగా ఆయన నివాసం ఉన్న చోటే పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నిందితుడు అనారోగ్యంతో మృతి

కర్నూలు : తక్కువ ధరకే బంగారం విక్రయిస్తామంటూ మోసానికి పాల్పడిన నెల్లూరు జిల్లా కావలి పట్టణం వెంగలరావు నగర్‌కు చెందిన పోతురాజు శాంతి పవన్ కుమార్ అలియాస్ వసంత్ (59) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విజయవాడలోని సూర్యరావు పేట బద్రి హైట్స్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను ఏడుగురు నిందితులు కలసి తక్కువ ధరకే బంగారం విక్రయిస్తామని నమ్మించారు. అతని నుంచి రూ.7.32 కోట్లను బ్యాంకు ద్వారా నగదు రూపంలో తీసుకుని మోసగించారు. ఈ ఏడాది మార్చిలో కర్నూలులోని ఓ లాడ్జిలో నిందితులు ఉండగా బాధితుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ వారిని కలసి తన డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీశాడు. నిందితులు చంపేస్తామని బెదిరించి అతని వద్ద ఉన్న రూ.50 వేలను దౌర్జన్యంగా లాక్కున్నారు. దీంతో బాధితుడు కర్నూలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జూన్ 18వ తేదీన కేసు నమోదు చేసి నిందితులను గత నెల 30వ తేదీన అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు. కర్నూలు శివారులోని జిల్లా జైలులో ఉన్న పోతురాజు శాంతి పవన్ కుమార్ కిడ్నీ సమస్యతో తీవ్రంగా బాధ పడుతుండటంతో శుక్రవారం ఆసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. మూడో పట్టణ పోలీసులు అనుమానాస్పద కేసు కింద నమోదు చేసి విచారిస్తున్నట్లు సమాచారం.

ఆటో డ్రైవర్‌ను ఆదుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): కలెక్టరేట్‌లో ఆటోపై చెట్టు పడి వాహనం దెబ్బతినడంతో పాటు గాయాలకు గురైన ఆటో డ్రైవర్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్, న్యూసిటీ ప్రధాన కార్యదర్శి బి. రాధాకృష్ణ కోరారు. శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్‌ను వారు పరామర్శించారు. స్థానిక రాజీవ్ గృహకల్పలో నివాసముండే ఓంకారయ్య కలెక్టర్ కార్యాలయంలోని ఎస్‌బీఐ బ్యాంకులో విధులు నిర్వహించే ఓ ఉద్యోగినిని ప్రతిరోజూ ఆటోలో తీసుకొచ్చి, మళ్లీ ఇంటికి తీసుకెళ్లే క్రమంలో శుక్రవారం ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంలో ఓంకారయ్య తలకు గాయం కావడంతో పాటు ఆటో పూర్తిగా దెబ్బతిందన్నారు. అనంతరం వారు డీఆర్‌ఓ సి.నారాయణమ్మను కలిసి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆటో నాయకులు చంద్రశేఖరయ్య, జి.సత్యనారాయణరెడ్డి, కె.సుబ్బయ్య పాల్గొన్నారు.

ఈ రోజు

జానపద సంగీత విభావరి

కర్నూలు కల్చరల్: టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు జానపద సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. రాయలసీమ, తెలంగాణకు చెందిన ప్రముఖ జానపద కళాకారుల బృందంతో సంగీత విభావరి ఉంటుందని పేర్కొన్నారు. గాయనీ గాయకులు హైదరాబాద్‌కు చెందిన అలూరి రాజ, విష్ణు, అఖిల, నరసింహులు, కర్నూలుకు చెందిన గంగాధర్, ప్రొద్దుటూరుకు చెందిన మహేందర్ పాటలు పాడుతారని తెలిపారు.

హైపర్‌టెన్షన్‌పై అవగాహన

కర్నూలు(హాస్పిటల్): హైపర్‌టెన్షన్‌పై ఆదివారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో సదస్సు ప్రారంభమవుతుందని, సదస్సులో ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ.వసంత కుమార్ అవగాహన కల్పిస్తారని తెలిపారు.

భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: తొలి ఏకాదశిని పురస్కరించుకొని గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు సంకల్ బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు సంఘం అధ్యక్షుడు, గీతా రత్న పురస్కార గ్రహీత డీవీ రమణ తెలిపారు. సామూహిక గోపూజ, విష్ణు సహస్రనామ పారాయణం, సంపూర్ణ భగవద్గీత పారాయణం, ధార్మిక ప్రముఖులతో ప్రవచనాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో గీతా ప్రచార సంఘం సభ్యులు, ధార్మిక సంస్థల సభ్యులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

తేలని వీఏఏల బదిలీలు!

- మార్పులు, చేర్పులపై కూటమి పార్టీల నేతల నుంచి పెరుగుతున్న సిఫార్సులు
- జాప్యంతో ఆందోళనలో వీఏఏలు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖలో వీఏఏల బదిలీల వ్యవహారం గందరగోళంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత నెల 29 నుంచి కసరత్తు చేస్తున్నప్పటికీ ఇంతవరకు కొలిక్కి రాకపోవడం పట్ల వీఏఏల్లో ఆందోళన పెరిగిపోతోంది. రాజకీయ సిఫార్సుల కారణంగా బదిలీల్లో ఏదో జరిగిపోతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి రెండు రోజుల కిందటే బదిలీల లిస్ట్ విడుదల చేసినప్పటికి అనేక తప్పులు, పొరపాట్లు ఉండటంతో వాటిని హోల్డ్‌లో పెట్టారు. తప్పొప్పులను సరిచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నా కొలిక్కి రావడం లేదు. ఇటీవల ఏవో, ఏడీఏల బదిలీల్లో గతంలో ఎప్పుడూ లేని విధంగా రాజకీయ పైరవీలు జరిగాయి. బదిలీల్లో రాజకీయ జోక్యం పెరిగిపోవడం, ముడుపులు రాజ్యమేలడంతో వ్యవసాయ శాఖ పరువు బజారున పడింది. తాజాగా వీఏఏల బదిలీల్లోనూ.. పైరవీల పర్వం నడుస్తుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి పార్టీల నేతల నుంచి మార్పులు, చేర్పులపై సిఫార్సులు వస్తుండటంతో అధికారులు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. దీని వల్ల తమకు ఎక్కడ అన్యాయం జరుగుతుందోనని వీఏఏలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో కొందరు ఉద్యానశాఖ సహాయకులు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమకు జరుగుతున్న అన్యాయంపై వినతిపత్రం అందజేశారు. సీనియార్టీని పరిగణనలోకి తీసుకోలేదని, ఉమ్మడి జిల్లా కౌన్సెలింగ్ నిర్వహించలేదని, ఖాళీల పూర్తి వివరాలు ప్రదర్శించకుండా రెండుమూడు ఆప్షన్లు మాత్రమే ఇచ్చారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

రూ.2.42 కోట్ల స్వాహాతో సంబంధం లేదట!

- విలేకరులతో కర్నూలు అర్బన్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ మాజీ చైర్మన్ బాలరాజు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో రూ.2.42 కోట్ల స్వాహా వ్యవహారంతో తమకు సంబంధం లేదని మాజీ చైర్మన్ ఎ.బాలరాజు తప్పించుకునేందుకు ప్రయతిస్నస్తున్నారు. ఇందులో భాగంగా నిధుల స్వాహా నెపమంతా సీఈఓగా వ్యవహరించిన రఫీక్, క్యాషియర్ జాకీర్‌బాషాపై నెట్టారు. శనివారం అర్బన్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో జరిగిన నిధుల స్వాహాపై ఆయన కలెక్టరేట్‌లోని మీడియా పాయింట్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించి తనతో పాటు పాలకవర్గం తప్పు లేదని చెప్పుకొచ్చారు. అంతే కాదు 2019-20లో క్యాష్ బుక్‌లు తనిఖీ చేయగా... రూ.10 లక్షలు దుర్వినియోగం అయినట్లు తేలిందని, డైలీ డిపాజిట్‌ల సేకరణకు వినియోగించే కార్డుల స్థానంలో నకిలీ కార్డులు వినియోగించి రూ.44.82 లక్షలు స్వాహా చేసినట్లు 2021-22 ఆడిట్‌లో తేలిందని చెప్పారు. 2019-20 నుంచే అక్రమాలకు పాల్పడుతున్నప్పుడు చైర్మన్‌గా బాలరాజుకు సర్వాధికారాలు ఉండి కూడా వెంటనే వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది.

మహిళలకు రక్షణ కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలోని 15వ వార్డు బుధవారపేట మహిళలకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎన్‌జీ కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కేవీపీఎస్ 15వ వార్డు మహిళ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డులో అసాంఘిక కార్యక్రమాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో నాటు సారా, బంగి, గంజాయి సేవిస్తూ యువత పెడదోవ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల నిఘాలేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం మహిళా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా కళావతి, రేణుకను ఎన్నుకున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

కర్నూలు సిటీ: ప్రజా రవాణా సంస్థ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు చేపట్టాలని ఏపీ జిల్లా ప్రజా రవాణా ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై ఆ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని డిపోల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టారు. శనివారం కర్నూలు డిపో-1 దగ్గర ఆ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి, ఆ డిపో అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర, ఆర్‌వీఎం రావు, కర్నూలు డిపో-2 దగ్గర జిల్లా జాయింట్ సెక్రటరీ కృష్ణార్జునరెడ్డి, ఆ డిపో అధ్యక్ష, కార్యదర్శులు జి.వి రెడ్డి, మహేశ్వరరావు పాల్గొని ప్రసంగించారు. సంస్థలో డ్రైవర్లు, కండెక్టర్లు, మెకానిక్‌ల కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. ఆయా పోస్టులు భర్తీ చేయడంతో పాటు 11వ పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలని, ఎలక్ట్రికల్ వాహనాలను ఆర్టీసీ ద్వారానే కొనుగోలు చేయాలన్నారు. ఎన్నికల ముందు ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. కొత్త పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ధర్నాలో ఆ అసోసియేషన్ కమిటీ సభ్యులు రామకృష్ణ, రబ్బాని, షమీవుల్లా, శివకేశన్న, కేసీవై కృష్ణ, వైవీఎస్ రెడ్డి, గ్యారేజీ కార్యదర్శి వీరేష్, ప్రసాద్, చక్రపాణి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.


కర్నూలు డిపో-2 ఎదుట ధర్నా చేస్తున్న జిల్లా ప్రజా రవాణా సంస్థ ఉద్యోగులు

దోమకాటు నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రాణాంతక వ్యాధులు కలగజేసే దోమల పట్ల ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. శనివారం ఆయన గాయత్రి ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో పేదలకు దోమతెరలు, మస్కిటో కాయిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో దోమల ఉధృతి అధికంగా ఉంటుందని చెప్పారు. మురికినీరు, మంచినీటిలో ఉండే దోమల ద్వారా వివిధ రకాల వ్యాధులు వస్తాయన్నారు. దోమ కాటు వల్ల డెంగీ, మలేరియా, జేఈ, ఎల్లోఫీవర్, జికా వైరస్, బోదకాలు వంటి వ్యాధులు వస్తాయన్నారు. ముందు జాగ్రత్తగా దోమతెరలు, మస్కిటో కాయిల్స్ వాడి దోమకాటు నుంచి రక్షించుకోవాలని సూచించారు.


మస్కిటో కాయిల్స్ పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకరశర్మ

షుగర్ బోర్డులపై విద్యార్థులకు అవగాహన

కర్నూలు సిటీ: నగర శివారులోని ఇండస్ స్కూల్‌లో శనివారం విద్యార్థులకు షుగర్‌బోర్డులపై అవగాహన కల్పించారు. నిదానంగా, నిశ్శబ్దంగా, నాశనం చేసే ముప్పు అనే శీర్షికతో అర్థధర్మ ఫైనాన్షియల్ లిటరసి, అదితి మిల్లెట్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించాయి. ఆ సంస్థ ప్రతినిధి శ్రీలక్ష్మి, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ అసోసియేట్ ప్రొఫెసర్ డా.డి స్వప్నశ్రీ అతిథులుగా హాజరై మాట్లాడుతూ చిన్న వయస్సులోనే విద్యార్థులు చక్కెర స్థాయి అధికంగా ఉన్న ఆహారాలను తీసుకోవడం ద్వారా షుగర్, ఊబకాయం తదితర అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారని చెప్పారు. ఏఏ ఆహారంలో ఎంత షుగర్ ఉంటుందో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఇండస్ స్కూల్ హెచ్‌ఎం మీనాక్షి విల్సన్, సీబీఎస్ఈ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అకడమిక్ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు.


కూల్ డ్రింక్స్‌లో చక్కెర స్థాయి గురించి వివరిస్తున్న దృశ్యం

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈనెల 9వ తేదీన దేశ వ్యాప్తంగా చేపట్టే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ నగర కార్యదర్శి సురేష్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం గోకారి భవన్‌లో ఆయూనియన్ నాయకులు సార్వత్రిక సమ్మెకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ..కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించాలన్న ఉద్దేశంతో సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు చెప్పారు. జీఓ నంబర్ 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, విజయ్, ఓబులేష్, మోహన్ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు

ఈనెల 9వ తేదీన చేపట్టే సార్వత్రి సమ్మెలో పాల్గొంటున్నట్లు నవత ట్రాన్స్‌పోర్టు హమాలీ యూనియన్ యాజమాన్యానికి నోటీసు ఇచ్చింది. దిన్నెదేవరపాడు సమీపంలోని నవత ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో శనివారం యూనియన్ అధ్యక్షుడు రామచంద్రుడు ఆధ్వర్యంలో కార్మికులు సమావేశమై సమ్మెలో పాల్గొంటున్నట్లు సీఐటీయూ నాయకులు ఆర్.నరసింహులుకు తెలిపారు. అలాగే కర్నూలు మార్కెట్ యార్డులో పనిచేస్తున్న కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నట్లు సీఐటీయూ నాయకులు రాముడు,. సీహెచ్ సాయి బాబా ఆధ్వర్యంలోని బృందం సెక్రటరీ జయలక్ష్మీకి నోటీసులు ఇచ్చారు.

రెయిన్ కోట్లు పంపిణీ

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ప్రగతి సమితి ఆధ్వర్యంలో జర్నలిస్టులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. శనివారం ఆ సమితి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు శ్రీహర్ష మాట్లాడుతూ తన వంతుగా రెయిన్‌కోట్లు అందించినట్లు వెల్లడించారు.